**హఠాత్తుగా అక్కడనుంచి లేచి లోపల కెళ్లింది భాను. చంద్రం తల్లి వైపు కంగారుగా చూశాడు. ఆమె దిగులుగా తలవాల్చుకుంది.**

"నాన్నా! మీరేం వర్రీకాకండి. నేను భానుకి నచ్చ చెబుతాను" అన్నాడు చంద్రం తండ్రి వైపు చూస్తూ.

"ఈ నచ్చచెప్పడం, ఏదో విధంగా ఒప్పించడం ఇవేమీ వద్దు. ఇది ఒక రోజుతో అయ్యేదీ కాదు. ముందు ముందు ఎప్పుడూ ఆ అమ్మాయి నిన్ను నిలవేసి ప్రశ్నించే పరిస్థితి ఎప్పుడూ రా కూడదు. నలుగురికీ ఏకాభిప్రాయం కుదిరితేనే కృష్ణుణ్ణి పై చదువుకి పంపిద్దాం" అన్నాడు నాగభూషణం.

'అయినా ఎంతోమంది పాలిటెక్నిక్ చదివి ఉద్యోగం చేస్తూ ఇంజనీరింగు పూర్తి చేస్తున్నారు.' ఎవరూ మాట్లాడకపోవడంతో మళ్లా రెట్టించి



# అద్దం

డి. సుజాతాదేవి

అన్నాడు నాగభూషణం.

'ఈ పిల్లకేమైనా ఒంట్లో బాగా లేదా ఏమిటి?' అంటూ లోపలకెళ్ళింది శాంతమ్మ.

లోపల గదిలో బట్టలు మడత పెడుతోంది భాను.

"నేను మడత వేసేదాన్ని కదమ్మా. నువ్విట్లా గభాలున వచ్చేస్తే కడుపులో వికారపెడుతుందేమో అనుకున్నా. అవి నేను మడత వేస్తాగాని కాస్త ముఖం కడుక్కుని వచ్చి ఆ నిమ్మ బద్దలైనా చప్పరించు. ఏమిటో! రోజూ సాయంత్రం అయ్యే సరికి వాంతులు కావడం. చీకటి పడే వేళకు నువ్వు డీలా పడిపోవడం" అంది శాంతమ్మ.

"మీరేదో మాట్లాడుకుంటున్నారు గదా అని వచ్చానంతే" ముభావంగా అంది భాను.

"నీకు తెలియని మాటలేమున్నాయమ్మా! పిల్లల చదువుల ప్రసక్తి వచ్చినపుడల్లా ఇలా మల్లగుల్లాలు పడుతూనే ఉంటాం. అయితే ఇది వరకు మేమిద్దరమే. ఇప్పుడు నలుగురం" అని వెళ్ళి పోయిందామె.

ఆవిడ మామూలుగానే అన్నా భానుకి అది సూటిగా తగిలింది. నిజానికి కొత్త కోడలు. తన పెత్తనం ఏముంది? తన అభిప్రాయానికి విలువ ఇస్తున్నారు గనుక ఆలోచిస్తోంది గాని. వాళ్ళే నిర్ణయం తీసుకున్నా తనేం మాట్లాడగలదు-అనుకుంది.

కాని ఆ ఆలోచన ఎక్కువసేపు నిలవలేదు. అప్రయత్నంగా ఆమె చేతులు పొట్టను తడిమాయి. తనలో రూపుదిద్దుకుంటున్న ప్రాణి 'నేనున్నా' నంటోంది. ఆ ఇంట్లో ఆమె ఉనికిని బలపరుస్తోంది. హక్కును గుర్తు చేస్తోంది.

ఇపుడత్తగారిలానే తనూ తన బిడ్డ భవిష్యత్తు గురించి ఆలోచిస్తోంది. తప్పా? కాదు కాదు! అని తనే సమాధానం చెప్పుకుంది భాను.

ముందు గదిలోంచి వాళ్ళ మాటలు వినిపిస్తు న్నాయి. ఏదో విధంగా కృష్ణుడిని ఇంజనీరింగు చదివించాలనే అత్తగారి తాపత్రయం అర్థమవు తోంది. బయటకు వెళ్ళాలనిపించలేదు భానుకు.

"ఇక్కడ కూర్చున్నావేమిటీ?" అంటూ చంద్రం వచ్చాడు.

"ఏమీ లేదు. బద్ధకంగా ఉందంతే" అంది భాను ముక్తసరిగా. "నువ్విలా వచ్చేస్తే, అమ్మా నాన్నా ఏమనుకుంటారు? కృష్ణుడిని పై చదువుకి పంపించడం నీకిష్టం లేదనుకోరూ? అమ్మకు మాత్రం వాడిని ఎలాగైనా సరే చదివించాలని ఉంది."

'బావుంది. మీరు చెప్పేది. అమ్మానాన్నా అన్నాక ఎవరైనా తమ పిల్లలు పెద్ద చదువులు, చదివి పెద్ద పెద్ద ఉద్యోగాలు చేయాలనుకుంటారు.'

"ఆహా! అది తెలుసుగదా! సరే నువ్వు కూడా రా" అంటూ వెళ్ళబోయాడు చంద్రం.

"మరి మనం మాత్రం అమ్మానాన్నల్లా ఆలోచించవద్దా?" కొరడా కొసలా చురుక్కున తగిలిందా మాట చంద్రానికి. గిరుక్కున వెనక్కు తిరిగాడు. ఎవరో కొత్త మనిషిని చూస్తున్నట్లు భానును చూస్తున్నాడతను. ఇంకా కొత్తలు తీరని ఇల్లాలి నోట 'అమ్మానాన్నలం' అనే మాట గిలిగింతలుగా ఉన్నా, అమ్మ చేతి వెంట కన్న కూతురిలా తిరిగే కొత్తకోడలి ఆలోచన కూడా ఆశ్చర్యంగానే ఉందతనికి.


భాను చూపులు నేల కతుక్కుపోయినై. సొమ్ముతో సహా పట్టుబడిన దొంగలా దడదడ లాడుతోంది. పడమర వైపు కిటికీ లోంచి, అస్తమిస్తున్న సూర్యుడి జేగురు వెలుగు భాను ఎడమ చెంప మీద పరుచుకుంది. భాను నిజంగా కొత్తగా ఉంది.

"ఏమిటసలు నీ ఉద్దేశ్యం?" అన్నాడు చంద్రం దగ్గరగా వచ్చి.

"పొరుగూరిలో ఉండి ఇంజనీరింగు చదవడమంటే మాటలా! తరువాత ఉద్యోగం రావాలి. ఇక్కడ మీ ఒక్క జీతం ఇల్లు గడుపుకుంటూ పెద్ద వాళ్లను చూసుకుంటూ. కృష్ణుడికెంత పంపవలసి ఉంటుందో ఆలోచించారా? రేపు... రేపు... మన పిల్లాడు పెరుగుతుంటే వాడికీ మంచి తిండి - చదువు..."

చంద్రం నుంచి జవాబు రాకపోవడం గుబులుగా గుటకలు మింగుతూ అతని వైపు తిరిగింది భాను. ఇపుడామె ముఖం మీద వెలుగు లేదు.

"కాని భానూ! ఈ రోజు మనం తీసుకునే నిర్ణయం మీద కృష్ణుడి జీవిత విధానం, అతని చదువు, ఉద్యోగం, ఇల్లాలు, పిల్లల జీవన స్థాయి,




అన్నీ ఆధారపడి ఉన్నాయి తెలుసా?" అన్నాడు చంద్రం.

"తెలుసు. అంతేకాదు. మన పిల్లల పెంపకం, చదువు జీవన స్థాయి కూడా!"

చంద్రం మాట్లాడకుండా అక్కడ నుంచి వెళ్ళి పోయాడు. కాసేపటికి భోజనాల హడావిడి.

'అత్తగారికి కోపం వచ్చిందేమో తనను పిలవలేదు' అనుకుంది భాను. మరీ మనసు చికాగ్గా ఉందని వెనక వైపు వెళ్ళి ముఖం కడుక్కుని వస్తుంటే శాంతమ్మ పిలిచింది.

"అదేమిటమ్మాయ్! లైటన్నా వేసుకోకుండా కూర్చున్నావ్? చంద్రుడు కడుపులో ఉన్నపుడు నాకూ అంతే, వెలుతురు చూస్తే చాలు ఎంత కోపమొచ్చేదో, తలుపులూ, కిటికీలూ వేసుకుని పగలంతా ఒకటే నిద్ర, ఒకటే నిద్ర. నువ్వూ అంతే. అంటే నాకు మనవడే పుడతాడు."

చిన్నగా నవ్వి తలవంచుకుని గదిలో కొచ్చేసింది భాను.అయినా వాళ్ళమాటలు వినిపిస్తూనే ఉన్నాయి.

'ఇన్నాళ్ళూ నేను వద్దంటూ వచ్చాను గానీ. ఇంక మనమో డైనింగు టేబుల్ చేయించు కోవాలిరా అబ్బాయ్! రేపు చంటాడు దోగాడుతూ వచ్చాడంటే ఇలా నట్టింట నాలుగూ పెట్టుకుని కూర్చోనిస్తాడా?' అన్నాడు నాగభూషణం.

"సర్లెండి. ఇప్పుడలాంటివేం పెట్టకండి. కృష్ణుడి చదువు పూర్తవ్వాలి ముందు" అంది శాంతమ్మ.

ఎవరూ ఏం మాట్లాడలేదు.

ఇలా ఎన్ని అవసరాల వాయిదా వేయాలో అనుకుంది భాను. ముఖం తుడుచుకుని అలవాటుగా తన టాయిలెట్ బాక్స్ తెచ్చి టేబులు మీద పెట్టుకుంది. చేతికి, చల్లగా, నునుపుగా, ఆత్మీయంగా ఉంటుంది దాని స్పర్శ. ఊహ తెలిసినప్పటి నుంచీ ఇంట్లో చూస్తూనే ఉన్నా అంతగా పట్టించుకోలేదు.ఇక్కడికొచ్చాక అది అమ్మలా, అమ్మకు గుర్తుగా.

ఆ రోజు తన పెళ్ళిరోజు, తనకు ఒడి బియ్యం కట్టిన అమ్మ కన్నీటి ధారలైపోతూ, ఆ పెట్టె పట్టుకొచ్చింది. నల్లచేవ కర్రతో చేసిన ఆ పెట్టె అమ్మ కన్నీళ్లతో తడిసి మరింత నిగనిగ లాడింది.

"భానూ! ఇదిగో, ఇది నా పెళ్ళికి మా నాన్న స్వయంగా వడ్రంగి దగ్గర కూర్చుని చేయించాడు. బొట్టూ, కాటుక, గాజులు, దువ్వెన పెట్టుకోడానికి, వేరు వేరు అరలున్నాయి. మంచి బిళ్లేరద్దం కూడా బిగించారు." ఇంకోసారైతే, "అబ్బా! ఏమిటమ్మా నీ చాదస్తం. రోజూ చూసేదేగా" అని విసుక్కునేదే కాని ఆ రోజు మౌనంగా దాన్నందుకుంది.

"భాను తల్లీ! ఇన్నేళ్ళూ నీకు పాపిడి తీసి జడ వేశాను. పౌడరద్ది బొట్టూ కాటుకా పెట్టాను. నువ్వు నా అంత అయ్యాక కూడా, నీ అలంకరణా ఆలోచనలూ దిద్దుతూనే ఉన్నాను.

"కానీ ఇంక నుంచీ నీ వెనక నేనుండను.

నిన్ను నువ్వే దిద్దుకోవాలి. నీ ముఖం నువ్వే చూసుకోవాలి. అద్దంలో చూసుకునేది ముఖం మాత్రమే కాదు. మనసు కూడా. అది కూడా అద్దంలా ఉండాలి. ఉంటేనే అందం. అసలు అందం అంటే అదే!"

ఎందుకో అమ్మ గుర్తు వచ్చినప్పుడు - ఆ రోజు తనను సాగనంపుతూ కన్నీరు మున్నీరుగా అన్నీ ఆ మాటలూ రూపమూ గుర్తుకొస్తాయి. తనకెలాగైనా సరే మంచి సంబంధం చేయాలని ఎంత తపనపడేదో. అమ్మ కోరిక నెరవేరింది తను మంచి మనుషుల మధ్యపడింది.

ఒకవేళ తనకు ఆడపిల్లపుడితే అమ్మలా తను కూడా - ఆ ఆలోచన ఎవరికీ తెలియక పోయినా సిగ్గుపడిపోయింది భాను. మళ్లా ఆలోచనలు బందిపోటు దొంగల్లా ఆమెను ముట్టడించాయి. జీతంలో సగం కృష్ణుడికి పంపించేస్తుంటే తన పిల్లల్ని -

బొట్టుపెట్టె మూత తెరచింది.

"ఇంకా లైటు లేకుండానే కూర్చున్నావా? రా మనిద్దరం భోజనం చేద్దాం" అని లైటువేసింది శాంతమ్మ. బొట్టుపెట్టుకుందామని అద్దంలోకి చూసిన భాను కెవ్వున కేకవేసి కళ్లు మూసుకుంది.

"అయ్యో - అయ్యో - అసలు వెలుగేపడకపోతే అన్నమెట్లా తింటావే?" అంటూ లైటు తీసేసింది శాంతమ్మ. భానుకి దు:ఖం తన్నుకువస్తోంది.

"మీరు తినండత్తయ్యా నేను తరువాత తింటాను" అంది భాను

"కాసిని మజ్జిగైనా తెస్తానుండు." అని వెళ్లింది శాంతమ్మ.

భానుకి ఇందాక అద్దంలో కనబడిన తన ముఖమే కళ్లల్లో కదులుతోంది. 'భయంకరంగా కళ్లు-ఎర్రగా యింతంత కళ్లు-' ఆ కళ్లల్లో తనెప్పుడూ చూడని పోలిక. 'ఆ చూపు తనకసలు పరిచయమే లేదు. ఆ చూపుతో కవళికలన్నీ వికారమైపోయి, అసలది తన ముఖమేనా'. 'అమ్మో... అమ్మో..' అనుకుంటూ ముడుచుకుని, ముడుచుకుని పడుకుంది. నెమ్మదిగా మగతలోకి జారిపోయింది.

"కాస్త మజ్జిగన్నమైనా తిను భానూ"! అంటూ శాంతమ్మ వచ్చితట్టి లేపుతోంది.

"రా, నీ కోసమని పచ్చిమిరపకాయలు వేసి చింతకాయ పచ్చడిచేశాను. నోటికి హితవుగా ఉంటుంది" అంది శాంతమ్మ మళ్లీ.

బెడ్ లైట్ మూగవెలుగులో, ఆవిడ అమ్మలా కనబడింది భానుకు. 'పదండి' అని వెళ్లి అత్తగారితో పాటు భోజనానికి కూర్చుంది. నిజంగా పచ్చడి అమృతంలా ఉంది. కడుపు చల్లబడుతుంటే మనసు చల్ల బడుతోంది, ముందు గదిలోంచి వాళ్ల మాటలు వినిపిస్తున్నాయి.

"పాలిటెక్నిక్ చేరినా ఖర్చు ఖర్చేగదా కృష్ణా".




అన్నాడు చంద్రం. 'కాని ఉన్న ఊళ్లో ఇంట్లో ఉండి చదువుకోడమూ, పై ఊళ్లో చదవడమూ ఒకటేనా?' అన్నాడు నాగభూషణం.

కాసేపు ఎవరూ మాట్లాడలేదు.

"ఎలా చూసినా ఈ చదువు అదనపు బరువే నాన్నగారూ" అన్నాడు కృష్ణ

'సరిగ్గా అన్నయ్య ఇంటర్ పాసయ్యాక ఇదే సమస్య వచ్చింది. ఏదో ఆ రోజుల్లో స్కూల్ ఫైనల్ చదివి గుమాస్తాగా స్థిరపడ్డాను. అన్నయ్యకూడా ఏదో పనిలో జొరబడతాననే అన్నాడు. కాని నేను వనలేదు నా పెన్షన్ అమ్మిపారేశాను" అన్నాడు నాగభూషణం. వింటున్న భానుకి పాలమారింది.

'చెప్పద్దూ! పెన్షన్ అమ్మేయడమంటే నాకు భయంవేసింది. రేపు పిల్లలు మనల్ని చూసినా చూడకపోయినా ముసలితనంలో మన కాధార మేంటండీ.. అని అల్లాడిపోయాను. మీ మామగారు వినలేదు. పిచ్చిదానా! పుడుతూనే గుప్పెడు నూకలతో పుడుతున్నారా, ఎవరైనా? మన ముసలి తనం ఎలాగడపాలనుందో ఈ పాటికి నిర్ణయమై పోయే ఉంటుంది. తల రాత ఒక్కసారే రాస్తాడే వాడు. అది వంద సార్లు మారదు! అన్నారు' అంది శాంతమ్మ. ఆ జ్ఞాపకాలతో ఆమె కళ్లు చెమర్చాయి. భానుకి తింటున్న అన్నం చేదుగా అనిపించింది చెయ్యి కడుక్కుని గిన్నెలన్నీ సర్ది గదిలోకెళ్లి పోయింది. శాంతమ్మ ముందు గదిలో కెళ్లింది.

"అట్లా వాడి ఎమ్మెస్సీ పూర్తయింది. నీ మాట కొస్తే అందరూ లక్షలు లక్షలు పోసి కొనుక్కునే ఇంజనీరింగు సీటు నువ్వు స్వశక్తితో సంపాయిం చుకున్నావు. ఇక మనకున్నది ఈ ఇల్లొక్కటి" అన్నాడు నాగభూషణం.

"అప్పుడు నోటి దగ్గర కూడు - ఇప్పుడు నెత్తి మీద గూడు" అంది శాంతమ్మ.

"అలా అనకమ్మా! మేం లేమా? మేమెక్క డుంటే మీరూ అక్కడే ఉంటారు. మేమేం తింటే అదే తింటారు" అన్నాడు చంద్రం.

"అవుననుకో" అని శాంతమ్మ ఏదో అంటోంది. భానుకి నిద్ర పట్టేసింది.

భానుకి మెలకువ వచ్చేసరికి తెల్లగా తెల్లారింది. చంద్రం సన్నగా ఈల వేస్తూ తల దువ్వుకుంటు న్నాడు. భాను వెళ్లి ముఖం కడుక్కుని వచ్చేసరికి శాంతమ్మ కాఫీ కలిపింది. కాఫీ తీసుకెళ్లి చంద్రాని కిచ్చింది భాను. "ఆహా! నులివెచ్చని తొలివెలుగులో చెలి చేతి కాఫీ అమృతం" అన్నాడు చంద్రం.

"ఏమిటి? పొద్దున్నే కాఫీ డైలాగులు చెబుతు న్నారు! అయినా ఇది మీ అమ్మగారి చేతికాఫీ. తెచ్చింది మాత్రమే నేను" అంది భాను.

"నీ చేయి తగిలింది కదా."

"ఏమండీ."

"ఏమిటండీ" చిలిపిగా అన్నాడు చంద్రం.

"మరీ అత్తయ్య చెప్పారూ.. మామగారు అన్నారటా..." అని భాను ప్రారంభించేసరికి, చంద్రం సరదా మూడ్ చెదిరిపోయింది.

"చూడు భానూ!" అని ఏదో చెప్పబోయాడు.

"అబ్బా! నే చెప్పేది వినమంటుంటే."

"సరే చెప్పు."

"పుడుతూనే గుప్పెడు నూకలతో ఎవరూ పుట్టరట, విధివ్రాత ఒక్కసారేనట, అది వందసార్లు మారదట".

"అయితే?"

"మరి-మన.. మన..."

"ఆ... మన?"

పట్టరాని సిగ్గు భాను బుగ్గలమీద మొగ్గలేసి, చలితాధరాల అంచుల మీద చిరునవ్వులు పూసి, వాలు కళ్ల రెప్పల మీదవాలిపోయింది.

"ఆ.. మన?" అన్నాడు మళ్లీ చంద్రం.

"మన బాబు క్కూడా ఆ భవిష్యత్తు నిర్ణయం అయ్యే ఉంటుంది కదూ?" అంది భాను సిగ్గుగా.

పకపక నవ్వాడు చంద్రం.

నిన్న మొన్నటి దాకా, తల్లి చాటు పిల్ల. ఇవాళ కాబోయే తల్లి.

"ఇంత స్వార్థమెప్పుడు వచ్చింది భానూ నీకు? అప్పుడే అమ్మలా మాట్టాడుతున్నావు? ఇంకవాడు పుట్టాక మా గతి?"

"అవును. స్వార్థంతోనే చెబుతున్నా వినండి, ఇంటి విషయాలేమీ ఆలోచించకుండా, హాయిగా కృష్ణుడిని హన్మకొండ వెళ్లి ఇంజనీరింగులో చేరమనండి. ఇంట్లో ఓ భాగం అద్దెకివ్వచ్చు కదా! అడ్మిషన్ కెలాగో మామగారి పి.ఎఫ్., మీ సేవింగ్స్ ఉన్నాయి కదా! ఒకటే హైరానా పడిపోతున్నారు నిన్నటి నుంచీ."

ఆరిందాలా అంటున్న భానుని చూచి మురిసిపోతున్నాడు చంద్రం చుట్టుకుంటున్న అతని చేతుల్ని విడిపించుకుంటూ బొట్టు పెట్టె తీసింది భాను. పరవశంగా అద్దంలోకి చూడగానే ఈసారి తన ముఖం తనకే ముద్దొచ్చింది.